(గత వారం కొనసాగింపు)

## మనసొంపుగా



ఆ మర్నాడు సాయంత్రమే గోవిందరాజు అంకుల్ ఫోన్ చేసి గాయత్రి ఓ అరగంటలో తనింటికి వస్తోందని ఫోన్ చేశారు. నేను, రాగిణి హడావుడిగా రెడీ అయి అంకుల్ ఇంటికి వెళ్ళాం. గాయత్రి అప్పటికే అక్కడికి వచ్చేసింది. మమ్మల్ని చూడగానే కంగారు పడింది, చికాకు పడింది. 'వీళ్ళెందుకు వచ్చారు' అన్నట్టు గోవిందరాజు అంకుల్ వంక కోపంగా చూసింది. ఆమె చూపుల్ని అంకుల్ పట్టించుకోలేదు. తన కోసమే మేము వచ్చామన్న సంగతి గ్రహించిన గాయత్రి లేచి వెళ్ళిపోవడానికి ఉద్యుక్తురాలయ్యింది. అయితే అంకుల్ ఆమెకు ఆ అవకాశం ఇవ్వలేదు.

# ఆమె కోసం....

"గాయత్రీ! వీళ్ళు నీతో ఏదో మాట్లాడాలని వచ్చారు" అన్నారు అంకుల్.

"ఇంకా ఏం మిగిలిందని మాట్లాడతారు? నా కుటుంబాన్ని, నా కూతుర్ని సర్వనాశనం చేశారు. అయినా నన్ను పిలిపించింది వీళ్ళతో మాట్లాడించడానికేనా? ఆ విషయం ముందే చెప్పొచ్చుగా? మరేదో సాకు ఎందుకు చెప్పారు?" అని అంకుల్‌పై విరుచుకుపడింది గాయత్రి.

"అంత కోపమైతే ఎలాగమ్మా! కాస్త నిదానించు, ఎలాగైతేనేం వచ్చావు కదా! ఇది మీ ఇద్దరి కుటుంబాలకు సంబంధించిన వ్యవహారం. అన్ని విషయాలూ మనసు విప్పి మాట్లాడుకోండి" అన్నారు.

కొంచెంసేపు మౌనం తర్వాత రాగిణి అంది. "గాయత్రి గారు! కన్న తల్లిగా మీ ఆవేదనని మేము అర్థం చేసుకోగలం. అందుకే మీరెంత పరుషంగా మాట్లాడినా బాధపడలేదు. కాని.. కాని ఏ కన్నతల్లీ తన కూతురుపై వేయని దారుణమైన అభాండాన్ని మీరు సుభద్రపై వేశారు. అది అన్యాయం కాదా! మీకు మనసెలా ఒప్పింది?"

ఆ మాట వింటూనే గాయత్రి కస్సుమంటూ లేచింది.

"ఏంటి మీరనేది? అంటే.. అంటే.. నా కూతురికేం కాకపోయినా అన్నీ నేను కల్పిస్తున్నానా? అంటే ఈ వ్యవహారాన్ని ఇలా మలుపు తిప్పారన్నమాట. మీరు ఎంతకైనా తెగిస్తారు. అసలు మిమ్మల్ని బజారుకి ఈడ్వకుండా ఊరుకోవడం నాదే తప్పు. ఆ రోజే పోలీసు రిపోర్టు ఇస్తే మిమ్మల్నందరినీ కటకటాల వెనక్కు పంపేవారు. నేను నోరు మూసుకొని ఊరుకున్నందుకు మాటమార్చి నా మీద అభండాలేస్తున్నారు" అంది.

"చూడండి. మీరెంత నెత్తినోరు బాదుకున్నా, అరిచి గీపెట్టినా అసలు జరిగిందేమిటో మీకు, మాకూ అందరికీ తెలుసు. మీ తాటాకు చప్పుళ్ళని భయపడి మేమిక్కడికి రాలేదు. మీరు నిజంగా పోలీసు రిపోర్టు ఇచ్చి వుంటే ఈ పాటికి మీరే జైల్లో వుండేవారు. మీ పరువే బజార్నపడేది! ఇప్పటి వరకు ఈ వ్యవహారం మన మధ్యనే వుంది కాబట్టి సరిపోయింది. లేకపోతే మేం కూడా తాడోపేడో తేల్చేసేవాళ్ళం. అందుకని బెదిరింపులు, చీదరింపులు మాని అసలు విషయానికి రండి" అంది కటువుగా రాగిణి.

రాగిణి మాటలకు ఖంగుతిన్న గాయత్రి కాస్త తగ్గింది. రెండు నిమిషాల మౌనం తర్వాత.

"ఇంతకీ మీరనేదేమిటి?" అంది.

"కేశవ్, సుభద్ర ప్రేమించుకున్నారు. కాబట్టి వాళ్ళిద్దరికీ పెళ్ళి చేయడం మన కర్తవ్యం. అసలు ఆడపెళ్ళి వారే ముందుగా ఈ ప్రస్తావన తెస్తారు. కాని మేం అవేవీ పట్టించుకోకుండా మేమే ఈ పెళ్ళి ప్రస్తావన తెస్తున్నాం. మీరు ఒప్పుకుంటే ముహూర్తాలు పెట్టుకుందాం" అంది రాగిణి. ఈ వ్యవహారాన్ని త్వరగా తేల్చేయాలనుకుంటోంది రాగిణి.

"ఈ పెళ్ళి జరగదు. అంతే. నా కిష్టం లేదు. అమ్మాయి క్కూడా ఇష్టంలేదు" అంది గాయత్రి.

"అమ్మాయితో మేమొకసారి మాట్లాడాలి" అంది రాగిణి.

"అమ్మాయితో మీరు మాట్లాడేదేమిటి? దానికి మందో మాకో పెట్టి నాకు కాకుండా చేస్తారు అంతేగా. నా గొంతులో ప్రాణముండగా మా అమ్మాయితో మాట్లాడనివ్వను. అయినా అది మానసికంగా ఎంతో దెబ్బతింది. ఎవరితోనూ మాట్లాడే



స్థితిలో లేదు" అంది గాయత్రి.

"అమ్మాయిని ఎంతకాలం దాచేస్తారు? ఇవాళ కాకపోతే రేపైనా మీ అమ్మాయి మా ఇంటి కోడలు కావల్సిందే. తప్పదు" అంది రాగిణి.

"అంటే మగదిక్కు లేని కుటుంబం కదాని నన్ను బెదిరిద్దామనుకుంటున్నారేమో మీ సంగతి తేలుస్తాను" అంది గాయత్రి.

రాగిణి కోపంగా ఏదో అనబోతుంటే నేను అడ్డుకొని

"చూడండి గాయత్రిగారు! కోపతాపాలకు, పట్టింపులకు ఇదా సమయం? మీరు మనసులో ఏదో పెట్టుకొని మాట్లాడుతున్నారు. వీళ్ళిద్దరికీ పెళ్ళి చేస్తే మీకు వచ్చే ఇబ్బంది ఏమిటి? మరేదైనా బలమైన కారణం వుందా? నిజానికి మీ అమ్మాయికి అన్నివిధాల మెరుగైన సంబంధం మాది. మరొకరైతే ఎగిరి గంతేసేవారు. కాని మీరు విపరీతంగా, విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు. దానికి అసలు కారణం ఏమిటి?" అన్నాను.

గాయత్రి నా మాటలతో మెత్తపడింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అవి మాకు కనిపించకుండా తల తిప్పేసుకుంది. నేను మెల్లగా లేచి గాయత్రిని భుజం మీద చేయి వేసి మెల్లగా పక్క గదిలోకి తీసుకెళ్లాను. అక్కడ మంచంపై కూర్చోబెట్టి "ఏ కన్నతల్లైనా తన కూతురు సుఖంగా, సంతోషంగా జీవించాలని కోరుకుంటుంది. మీరు కన్న తల్లే కాబట్టి సుభద్ర గురించి మీకు అలాంటి ఆశలే వుంటాయి, చెప్పండి. మీకు వున్న కష్టం ఏమిటి? నన్ను మీ అమ్మాయే అనుకోండి" అన్నాను.

నా అనునయ వాక్యాలకు గాయత్రి చలించిపోయింది. భోరున ఏడ్చేస్తూ మంచంపై వాలిపోయింది.

"నేనేమీ చెప్పలేను. అంతే. నన్నేమి అడగొద్దు. ఈ పెళ్ళి నేను చేయలేను. నన్ను వదిలేయండి" అంటూ దిండులో ముఖం దాచేసుకుని ఏడుస్తోంది.

ఇంతలో ముందుగదిలో ఏదో హడావుడిగా అనిపించి నేను కిటికీలోంచి చూశాను.

ఆశ్చర్యం! ఏడుస్తున్న సుభద్రను అంకుల్ ఓదారుస్తూ కనిపించారు. నేను వెంటనే బయటికి వచ్చేసి అంకుల్ని, సుభద్రను, రాగిణిని గబగబా వేరే గదిలోకి పంపేశాను. సుభద్ర రాకను గాయత్రి గమనించలేదు. నేను వెంటనే గాయత్రి వున్న గదిలోకి వచ్చేశాను.

అప్పటి గాయత్రి కాస్త తేరుకుంది. నన్ను చూసి, కళ్ళు తుడుచుకుంటూ "ఎవరో వచ్చినట్టున్నారు" అంది.

"ఎవరో అంకుల్ ఫ్రెండ్ వచ్చారు. సరే ఇవుడు చెప్పండి. ఈ పెళ్ళికి వున్న అభ్యంతరం ఏమిటి?" అని అడిగాను.

గాయత్రి నా రెండు చేతులూ పట్టుకొని,



"ఈ పెళ్ళి నా చేతుల్లో లేదు. నేనొక బందీని. నన్నేమీ అడగొద్దు" అంది గాయత్రి.

రెండు క్షణాల తర్వాత.

"సరే! మిమ్మల్ని బలవంత పెట్టను. కాని ఒక్కటి చెబుతున్నాను. వినండి. సుభద్రతో కేశవ్ పెళ్ళి జరిగి తీరుతుంది. ఎందుకంటే మీ సుభద్ర ఇవుడు మా దగ్గరే వుంది. ఈ పెళ్ళి ఆపడం ఎవరివల్లా కాదు. సుభద్ర తల్లిగారు కదాని మిమ్మల్ని ఇప్పటి వరకు ఒప్పించడానికి ప్రయత్నించాం. కాని మీరు ఒప్పుకోవడంలేదు, మీ ఇష్టం. మీ అమ్మాయి పెళ్ళి కూతురైతే అక్షింతలు వేసి ఆశీర్వదించే అదృష్టం మీకు లేదు" అన్నాను.

గాయత్రి ఆశ్చర్యంగా నా వంక చూసింది.

"అబద్ధం! సుభద్ర మీ దగ్గరికెలా వచ్చింది" అంది.

"మీతో అబద్ధం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. మీరు పెళ్ళికి ఎస్ అంటే ఇవుడే అమ్మాయిని చూపించగలను. నో అంటే మరెప్పటికీ మా అమ్మాయిని మీరు చూడలేరు" అన్నాను.

అయినా గాయత్రి నమ్మలేదు. నేను గాయత్రిని ఆ గదిలోనే వుంచి బయట గడియపెట్టి సుభద్రను, రాగిణిని బయటికి తీసుకొచ్చి మా ఇంటికి పంపేశాను. ఈ దృశ్యాన్ని గాయత్రి కిటికీలోంచి చూసింది. నేను తిరిగి వచ్చి గడియ తీశాను.

"నా సుభద్రను ఎక్కడికి తీసుకెళ్ళారు..? ఈ విషయం తెలిసిందంటే సుబ్బారావు నన్ను, సుభద్రను చంపేస్తాడు" అంటూ ఏడ్చేసింది.

"మీకు, మీ అమ్మాయికి నా ప్రాణం అడ్డేస్తాను. ఇప్పటికైనా అసలు అడ్డంకేమిటో, ఈ గొడవలంతటికీ కారణమేమిటో చెప్పండి" అన్నాను.

గాయత్రి నా రెండు చేతులూ పట్టుకొని, "నన్ను, మా అమ్మాయిని మీరే కాపాడాలి. ఆ సుబ్బారావు చాలా దుర్మార్గుడు. అమ్మాయిని వాడే తీసుకెళ్ళిపోయాడు" అంది.

"ఎందుకిలా చేశాడు?" అడిగాను.

"మీకెలా చెప్పను! దయచేసి ఈ విషయాన్ని మరెవరికీ చెప్పొద్దు. మా వారు పోయినప్పటి నుంచీ, నన్ను, సుభద్రను మా మరిది సుబ్బారావే చూస్తున్నాడు. మా పొలాలు, ఇంటి వ్యవహారాలన్నీ ఆయనే చూసేవాడు. మాకు మరో దిక్కు లేక సుబ్బారావుపై ఆధారపడవలసి వచ్చింది. చివరికి మా ఇల్లు, పొలం కాగితాలన్నీ తన దగ్గర వుంచుకున్నాడు. సుభద్ర కేశవ్తో కలిసి తిరగడం చూసి నన్ను బెదిరించాడు".

"ఎందుకు?"

"సుబ్బారావు ఎవరి దగ్గరో చాలా పెద్ద మొత్తంలో అప్పు చేశాడు. అప్పిచ్చిన వాళ్ళబ్బాయి కూడా సుభద్ర వెంటపడుతున్నాడు. సుభద్రని, ఆ అబ్బాయికి ఇచ్చి పెళ్ళి చేస్తే అప్పు మాఫీ చేస్తానని ఆయన అన్నాడట. అప్పటి నుంచి సుభద్రను ఆ కుర్రాడికే ఇవ్వాలని సుబ్బారావు నన్ను తొందరపెట్టాడు. సుభద్ర మాత్రం బాగా గొడవ చేసింది. కేశవ్నే చేసుకుంటానంది. అందుకే కేశవ్ బెడద వదిలించుకోవడానికి నన్ను ఇలా నాటకం ఆడమన్నాడు సుబ్బారావు. లేకపోతే సుబ్బారావుకి, నాకు అక్రమ సంబంధం వుందని ప్రచారం చేసి పరువు బజారుకీడుస్తానని, చంపేస్తానని, ఇంటి నుంచి వెళ్ళగొడతానని బెదిరించాడు. మరోదారి లేక, సుభద్ర కోసం నేనీ నాటకం ఆడాల్సి వచ్చింది. ఇలా చేసినందుకు నేనెంత నరకం అనుభవించానో ఆ భగవంతుడికే తెలుసు. అన్ని విధాల సుబ్బారావు చేతిలో ఇరుక్కుపోయి నరకం అనుభవించాను" అంటూ ఏడ్చేసింది గాయత్రి.

"మీకేం భయం లేదు. మీరు నిశ్చింతగా వుండండి. మేమంతా మీకు కొండంత అండగా వుంటాం. మీరిక ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. ఈనాటితో కష్టాలన్నీ తీరిపోయినట్టే. మీరింక నిశ్చింతగా, ఆనందంగా వుండొచ్చు"

అని గాయత్రికి ధైర్యం చెప్పాను. గాయత్రి, నేను, అంకుల్ కలిసి మా ఇంటికి పయనమయ్యాం.

గాయత్రిలా పరుల చేతుల్లో బందీలైన వాళ్ళు చాలా మంది వున్నారు నిజ జీవితంలో కూడా.

— "మోతీలాస్య"